కాంతమ్మగారి కాశీయాత్ర!

"తీయనైన తలపులతో కమ్మని కలలు కనే కన్నె వయస్సులో కాంతానికి కాశీయాత్ర చేయాలనే ఆలోచన కల్గింది. కాశీ వెళ్లి గంగలో మూడు మునకలు వేసి విశ్వనాథుడిని దర్శించాలని, కాశీ విశాలాక్షిని, అన్నపూర్ణను కన్నులారా వీక్షించాలని, కాలభైరవుడిని సేవించి రావాలనే కోరిక కల్గింది.

ఆమెకు అటువంటి వింత ఆలోచన ఆ వయస్సులో కలగ జేసింది ఇంటి ఓనరు పేరమ్మగారు. పేరమ్మగారి వయస్సు 70 సంవత్సరాలు. మనిషి దృఢంగా ఉంటుంది. ఆవిడకు భర్త కట్టించిన మండువా వాకిలున్న ఇల్లుంది. దానిని నాలుగు పోర్షన్లుగా మార్చి నాలుగు కుటుంబాల వారికి అద్దెకిచ్చింది. వాటి మీద ఆమెకు నెలకు నాలుగు వేలు అద్దె వస్తోంది. ఆ డబ్బుతో ఆమె ఎవరిమీదా ఆధారపడకుండా ప్రశాంతంగా జీవిస్తోంది.

పేరమ్మగారికి ఇద్దరు కొడుకులు. వారు మంచి జాబ్స్ చేస్తూ వేరు వేరు పట్టణాలలో ఉంటున్నారు. అప్పుడప్పుడు కుటుంబాలతో వచ్చి తల్లి వద్ద కొన్నిరోజులుండి వెళ్తున్నారు. అయితే పేరమ్మగారు ఎన్నడూ వెళ్ళి కొడుకుల వద్ద ఉండరు. అందుకు కారణం -

పేరమ్మగారికి దైవభక్తి ఎక్కువ. మడి, తడి, ఆచారం పాటించే మనిషి. నిత్యం పూజలు, వ్రతాలు, దానధర్మాలు చేస్తుంటారు. ఆమె భర్త పరాత్పరంగారు నాలుగేళ్ళ క్రితం పోయారు. పేరమ్మగారు ఏనాడు భర్తను పట్టువస్త్రాలు, నగలు వగైరాలు ఏవీ కోరలేదు. ఆమె భర్తను కోరింది - "తనకు పుణ్యక్షేత్రాలు, గుళ్ళూగోపురాలు చూపించమని" భార్య కోరికను ఆయన కాదనలేదు. ఆయనకూ దైవభక్తి ఉంది. ఇరువురూ సకల పుణ్యక్షేత్రాలు దర్శించేరు. వాటి వివరాలు పూర్తిగా తెలుసుకున్నారు.



నాలుగు వాటాలలో ఉన్న పిల్లలందరినీ పేరమ్మగారు రోజూ చేరదీసి వారికి పుణ్యక్షేత్రాల వివరాలు కథల రూపంలో చెప్పి ఆనందించడం ఆవిడ దినచర్య. పేరమ్మగారి యాత్రావిశేషాలు కాంతాన్ని ఎంతో ఆకర్షించేయి. అన్నిటి కంటే ఎక్కువ కాశీయాత్ర. పలుమార్లు ఆవిడ చేత కాశీక్షేత్ర వివరాలు చెప్పించుకొని విని ఆనందించింది.

"అమ్మా! మనం కూడ కాశీయాత్ర చేసుకుని వద్దామే!" అంది ఓరోజు తల్లితో కాంతం.

కూతురి మాటలు విని విస్తుపోయింది సూర్యలక్ష్మి.

"బావుందే నీ కోరిక! ఆదర్శాలు శిఖరమెక్కి కూర్చుంటే అవసరాలు అగాధంలోకి ఈడుస్తాయని! నిన్నో అయ్యచేతిలో పెట్టడమెలాగని మేము క్రిందా మీదా పడుతుంటే

యాత్రలట! కాశీయాత్ర! నోరు మూసుకో! మీ నాన్నగారు వింటే మండి పడతారు" అని చీవాట్లు తింది.

"తల్లి పెట్టిన చీవాట్ల వల్ల కాంతం ఆశలు అణగారి పోలేదు మరింత పెరిగాయి.

అనుకోకుండా సూర్యలక్ష్మి అన్నావదిన కాశీయాత్రకు వెళ్తూ వారి పిల్లలను చెల్లెలు వద్ద వదలి వెళ్ళాలని వచ్చారు. వారితో తననూ పంపింపచమని పట్టుపట్టింది కాంతం. అంత మంచి అవకాశం తిరిగిరాదని ఇంట్లో నానా గొడవ చేయమొదలిడింది.

సూర్యలక్ష్మి కూతురి గొడవ పడలేక పేరమ్మగారికి తమ పరిస్థితి వివరించి కాంతానికి నచ్చచెప్పిమంది. పేరమ్మగారు మరి కాదనలేక కాంతాన్ని పిలిచి

"చూడు అమ్మడూ! కన్నెపిల్లలు, కడుపుతో వున్న స్త్రీలు కాశీయాత్ర చెయ్యకూడదు తల్లీ! చేసినందువల్ల పుణ్యంరాదు సరికదా గొప్ప అనర్థం కలుగుతుంది. కాశీలో పూజలు వగైరా చేసే సయమంలో కాశీక్షేత్రాన్ని "మహాశ్మశాన"మనే వ్యవహరిస్తారు. అందువల్లే కన్నెపిల్లలు, గర్భిణీస్త్రీలు కాశీయాత్రకు అనర్హులు" అని చెప్పేరు.

"పేరమ్మగారు అబద్ధం చెప్పరు. ఆవిడ మాటలు నిజమే" అని నమ్మింది కాంతం.

"చూడు తల్లీ! కాశీయాత్రకు భర్తతో వెళ్ళి సరిగంగా స్నానం"చేయడం స్త్రీలకు ఎంతో పుణ్యం! మంగళప్రదం! భర్తతో కాశీయాత్రకు వెళ్ళడానికి నోచుకోని వాళ్ళు కన్న కొడుకు వెంట వెళ్ళాలి! అది సంప్రదాయం. నువ్వింకా చిన్నపిల్లవు, కన్నెపిల్లవు! నీకు పెళ్ళయ్యాక మీ ఆయనతో కాశీయాత్రకు వెళ్లి సరిగంగా స్నానం చేసి పుణ్యం మూట కట్టుకో!" అన్నారు నవ్వుతూ.

అయితే కాంతం, కాశీయాత్ర గురించి కలలు కనడం మానలేదు. ఆమె ఊహాలోకాలలో విహరిస్తుండగానే కామేశంతో వివాహం జరిగింది. పుట్టిల్లు వదిలి మెట్టినిల్లు చేరింది.

శోభనం గదిలో సిగ్గువిడిచి భర్తతో "ఏమండీ మనం కాశీయాత్రకు వెళ్ళాలండీ!" అంది.

భార్య కోరిక విని అదిరిపడ్డాడు కామేశం.

"ఏం నీకు గాని మొక్కుబడి ఉందా?" అన్నాడు.

"అబ్బే అటువంటిదేం లేదండీ! దైవదర్శనం చేసుకురావడానికి, యాత్రలు చేసుకురావడానికీ మొక్కుబడే ఉండాలా?" అంది.

మొక్కుబడి కాదనగానే కాస్త స్థిమితపడి "కాశీయాత్రంటే సామాన్యమైందికాదు! వీలుచూసుకొని త్వరలోనే వెళ్దాం" అన్నాడు.

భర్త మాటలకు కాంతం మహదానందం పొందింది.

కాంతం పెళ్ళిలో పేరమ్మగారు వెయ్యినూట పదహార్లు ఇచ్చి "ఇవి, నీ కాశీక్షేత్రయాత్రకొరకు వినియోగించు!" అన్నారు. ఫ్రెండ్స్, బంధువులు ఇచ్చిన సొమ్ము అంతా మొత్తం పదిహేను వందలుంది కాంతంవద్ద. ఆ సొమ్ము కాశీయాత్రకొరకే వినియోగించాలనుకుంది.

కాంతం అత్తగారు జయమ్మ ఎంతో లోతైన మనిషి. ఏ విషయంలోనూ తొందరపాటు చూపదు. ఎవరినీ చప్పున నమ్మదు. ప్రతి చిన్న విషయం నిశితంగా పరిశీలిస్తుంది. తండ్రిలేని లోటు ఏమాత్రం కనబడనీయకుండా కొడుకును పెంచి చదివించింది. కామేశానికి గవర్నమెంట్ జాబ్ వచ్చింది.

అత్తవారింటి పరిస్థితి అర్థం చేసుకునేందుకు కాంతానికి ఎక్కువకాలం పట్టలేదు. తల్లీకొడుకు లిద్దరూ ఏపనీ తొందరగా చేయరు. ప్రతి చిన్న విషయం గంటలకొలదీ చర్చించుకోనిదే నిర్ణయం తీసుకోరు. కామేశం మాతృవాక్య పరిపాలకుడు.

"తన భర్త ఏపనీ ఇనీషియేటివ్ తీసుకొని చేయడని, అత్తగారిని ప్రసన్నురాలుగా చేసుకోవడం మంచిదని" అనుకొని

"అత్తయ్యా! మీరేవైనా యాత్రలు చేసేరా?" అని అడిగింది కేజువల్‌గా.

"లేదు కాంతం! వీలు పడలేదు. ఎప్పటికప్పుడు అనుకోవడం తప్ప వెళ్లడం లేదు. బారెడు దూరంలో ఉన్న సింహాచలం, అన్నవరం, అరసవిల్లి, శ్రీకూర్మం యివే ఇంతవరకూ చూడలేదంటే నమ్ము!" అన్నారావిడ విచారంగా.

"అదేవిటండీ! అవన్నీ మనకు గంట, రెండు గంటల ప్రయాణదూరంలో ఉన్నవి. ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి తిరిగి రావచ్చు...."

"కదా! మరి ఆ ఉద్దేశంతోనే వీటిని ఎప్పుడైనా, ఎలాగైనా చూడొచ్చు. ముందుగా దూరంగా ఉన్న తిరుపతి, కంచి, కాళహస్తి, కాశీ, రామేశ్వరం, మధుర, శ్రీరంగం, కన్యాకుమారి వగైరా పుణ్యక్షేత్రాలు కాలు, చెయ్యి గట్టిగా ఉన్నప్పుడే వెళ్ళిచూసిరావడం మంచిది అనుకున్నాం. అయితే అటుదూరంగా ఉన్నవాటిని గాని, ఇటు దగ్గరలో ఉన్నవాటిని గాని ఏవీ చూడడం అవలేదు. దేనికైనా ప్రాప్తం ఉండాలి కదా!"

"అవును అత్తయ్యా! దైవకృపలేనిదే దైవదర్శనం అవదంటారు! అయినా కొంత వరకూ మనప్రయత్నం కూడా ఉండాలి కదా!" అంది కాంతం.

కోడలి మనోభావం గ్రహించింది జయమ్మ.

"నువ్వేమీ వర్రీ అవకు కాంతం! మనం చక్కగా ఆలోచించి ప్లానువేసుకొని చూడాలనుకున్న పుణ్యక్షేత్రాలన్నీ సావకాశంగా చూసి వద్దాం" అంది.

అత్తగారి మాటలు ఎంతో ఉత్సాహం కల్గించాయి కాంతాన్ని. తన మనసులోని కాశీయాత్ర కోరిక ఆవిడకు చెప్పింది.

"నీ ఆలోచన చక్కగా ఉంది కాంతం! అన్ని యాత్రలకంటే కాశీయాత్ర ఎంతో ఉత్కృష్టమైంది అంటారు. కాశీయాత్ర చేసివస్తే చాలు మిగిలిన యాత్రలు చెయ్యకున్నా పర్వాలేదు. ముందుగా మనం కాశీయాత్ర గురించే ప్లాను వేద్దాం! అబ్బాయిరానీ" అంది.

ఆ రాత్రి భోజనాలయ్యాక ముగ్గురూ కూర్చుని కాశీయాత్రకు ప్లాను తయారు చేసేరు. కాశీలో చూడవలసిన ప్రదేశాలు, పూజించవలసిన దేవుళ్ల వివరాలన్నీ విపులంగా చెప్పింది కాంతం. ఆ విషయాలన్నీ లోగడ పేరమ్మగారి వద్ద సేకరించినవి. కాంతం చెప్పినవన్నీ సావకాశంగా చూసిరావడానికి, కాశీకి ఎడా, పెడా నున్న గయా, ప్రయాగ యాత్రలతో, కనీసం వారంరోజులు, జర్నీ రానుపోను మూడు రోజులు మొత్తం పదిరోజులు లీవుకావాలి. రానూ పోనూ రైలు చార్జీలు, భోజనాలు, దైవదర్శనం ఊర్లో తిరగడానికి మనిషికి కనీసం మూడు వేలు ఖర్చు..ముగ్గరికీ తొమ్మిదివేలుండాలని బడ్జెట్ జాగ్రత్తగా వేసి చెప్పేడు. బేంకు పాస్ పుస్తకం తెచ్చి చూసేడు. అందులో బేలన్స్ ఆరు వందలుంది.

కామేశం పెళ్లిలో పైసా కట్నం తీసుకోలేదు. ఆ సంగతి కాంతానికి తెలుసు. ప్రతి నెలా ఇంటి ఖర్చులు పోను మిగిలిన సొమ్ము బేంకులో వేస్తున్నాడు. ఆ డబ్బే

పెళ్లి ఖర్చులకు వాడగా మిగిలింది ఆ ఆరువందలు.

భర్త మంచితనం తెలుసు కాంతానికి. కాశీయాత్ర కొరకు తన వద్దనున్న పదిహేను వందలు గురించి చెప్పింది.

"అబ్బాయి! పోనీ ఓ పనిచెయ్యరా! మొత్తం సొమ్ము రెండువేలుంది కదా! మరో మూడు నాలుగువేలు ఎవరి దగ్గరైనా సర్దుబాటు చేసుకొని మీరిద్దరూ కాశీయాత్ర చేసుకొనిరండి!" అంది జయమ్మ.

"అదేవిటి అత్తయ్యా! మన ముగ్గురం మనకు వీలున్నప్పుడే వెళ్దాం! తొందరేంటి? అయినా అప్పుచేసి యాత్రలకు వెళ్లడవేంటి?" అంది కాంతం నొచ్చుకుంటూ.

కోడలి అభిమానానికి ఎంతో ఆనందించింది జయమ్మ.

"కష్టసుఖాలు ఎరిగిన మనిషి!" అని మెచ్చుకుంది.

కామేశం ప్రతి నెలా జీతం అంతా భార్యకిస్తున్నాడు. అది ఇంటి ఖర్చులకు సరిపోగా వందా, ఏభై మిగులుతోంది. అది బేంకులో వేస్తున్నారు. జయమ్మ ఇంటి బాధ్యతలన్నీ కోడలికి అప్పగించింది.

నెలలూ సంవత్సరాలు గడుస్తున్నాయి. కాంతానికి ఇద్దరు ఆడపిల్లలు. కామేశానికి ఉద్యోగంలో ప్రొమోషన్ వచ్చి జీతం పెరిగింది. ఇంటి ఖర్చులు పెరిగేయి. పిల్లల చదువులు, ఆలనా పాలనా వారి సరదాలు, అత్తగారి అనారోగ్యం, డాక్టరు ఫీజులు, మందులు ఇంటి చాకిరీతో క్షణం తీరిక లేకుండా వుంది కాంతానికి.

"పాపం! నోరు విప్పి కొత్త కోడలు అడిగిన చిన్న కోరిక తీర్చలేని అసమర్థురాలు నీ అత్తగారు! ఆనాడు నేను చెప్తే వినిపించుకోలేదు. అప్పో, సప్పో చేసి కాశీయాత్ర చేసుకొని రమ్మంటే వినలేదు అందరకం కలిసి సరదాగా వెళ్దామన్నావు! చూస్తున్నావు కదా మన పరిస్థితి. ఏటికి ఏడాదీ ఖర్చులు. బరువు బాధ్యతలు పెరుగుతున్నాయి" అని జయమ్మ అప్పుడప్పుడు నొచ్చుకుంటోంది.

కాంతం ఇప్పుడు ఏ విషయానికీ అంతగా స్పందించటంలేదు. కాంతం అల్లా కాంతమ్మగా మారింది. ఆమెలో ఒక విధమైన నిరాశ, నిర్లిప్తత, ఆవేదన చోటు చేసుకున్నాయి. ఇంటి పనులన్నీ యాంత్రికంగా చేస్తోంది.

భార్యలో క్రమంగా వస్తున్న మార్పు గమనించి విషయం తెలుసుకుందికి ప్రయత్నించేడు. పలుమార్లు భార్యను ప్రశ్నించేడు. సరియైన సమాధానం దొరకలేదు. ఈలోగా అత్తగారు పోవటం, కూతుర్లు పెళ్లి అయి అత్తవారింటికి వెళ్లిపోవడంతో కాంతమ్మ మరింత దిగులు చెందింది.

భర్త రిటైర్ అయ్యేక చేతికి అందిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సొమ్ము చూడగానే కాంతమ్మకు కాశీయాత్ర విషయం గుర్తుకొచ్చి భర్త ముందు ఆ ప్రస్తావన తెచ్చింది.

ఇన్నేళ్ల తరువాత భార్య మళ్లీ నోరువిప్పి కాశీయాత్ర అనగానే వెంటనే అంగీకరించి

"తప్పకుండా వెళ్దాం! బయల్దేరడానికి ఎప్పుడు మంచిదో చూసి చెప్పు. రేపు ఉదయాన్నే వెళ్లి టిక్కెట్ల రిజర్వు చేయించుకొని వస్తాను" అన్నాడు ఉత్సాహంగా

భార్య నిర్ణయించిన రోజుకే రిజర్వేషన్ చేయించి ఆ టిక్కెట్లు అమె చేతికిచ్చేడు.

కాంతమ్మ ఆనందం పట్టలేక భర్తను వాటేసుకుంది.

కామేశం లోగడ ఎన్నడూ తన భార్య అంత ఉత్సాహంగాను, సంతోషంగా ఉండడం చూడలేదు.

ఆ రాత్రి కాంతమ్మ భర్త గుండెల మీద పడుక్కొని ప్రశాంతంగా నిద్రపోయింది.

కాశీయాత్రకు కాంతమ్మ నిర్ణయించిన రోజునే కూతుళ్లూ, అల్లుళ్లూ వీడ్కోలుతో బయల్దేరేడు కామేశం భార్య అస్థికల కలశతో-

(ఫేకర్ 1968 దసరా సంచిక) ✪